# పంట పొలాల్లో మంటలు ... భారీ ఆస్తి నష్టం





# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

సోమవారం | 25 మే, 2026 | పేజీలు : 04


# ప్రభుత్వం కోటలు దాటే మాటలు... అధికారులు గల్లీల్లో దోపిడీదందాలు

అన్నదాతల ఆవేదన, వడ్ల బస్తాకు రూ. 30, మక్కలకు రూ.60 చొప్పున అధికారుల నిలువు దోపిడీ !* రైస్ మిల్లుల్లో 'తరుగు' పేరిట 4 కిలోల కోత .. అక్రమ వసూళ్ళలో పై స్థాయి వరకు 'వాటాల' పంపిణీ ?

**ప్రజాపక్షం / నిర్మల్ :** రైతే రాజు, రైతు సంక్షేమమే మా ధ్యేయం, అంటూ పాలకులు కోటలు దాటే మాటలు చెప్తుంటే, క్షేత్రస్థాయిలో ఉన్న అధికార యంత్రాంగం మాత్రం దానికి పూర్తి భిన్నంగా వ్యవహరిస్తోంది. ప్రభుత్వం చెప్పే మాటలకు, అధికారులు చేసే చేతలకు ఎక్కడా పొంతన లేకుండా పోయింది. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ధాన్యం , మొక్కజొన్న, మక్కల కొనుగోలు కేంద్రాలతో పాటు రైస్ మిల్లుల్లో అన్నదాతలను పీల్చి పిప్పి చేసే అక్రమ వసూళ్ళ పర్వం యథేచ్ఛగా సాగుతోంది. అటు కొనుగోలు కేంద్రాల్లో బస్తాల పేరిట అదనపు వసూళ్ళు, ఇటు మిల్లుల్లో తరుగు పేరిట జరుగుతున్న శ్రమ దోపిడితో పాటు రైతాంగం నిలువునా మునిగిపోతుంటే, అధికార యంత్రాంగం మాత్రం తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తూ మామూళ్ళ మత్తులో జోగుతోంది. ఈ అక్రమ వసూళ్ళ సొమ్మును కింది స్థాయి నుండి పై స్థాయి అధికారుల వరకు అందరూ కలిసి వాటాలు (షేర్లు) గా పంచుకుంటున్నారనే బలమైన ఆరోపణలు వినవస్తున్నాయి.



### నిలువు దోపిడి.. బస్తా, బస్తాకు రేట్లు !

లారీల కొరతను, హమాలీల ఇబ్బందులను సాకుగా చూపిస్తూ అధికారులు, మిల్లుల నిర్వాహకులు కుమ్మక్కై రైతులపై పగబట్టినట్లు వ్యవహరిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల నుండి పంటను సకాలంలో తరలించకుండా, ఒక్కో వడ్ల బస్తా లోడింగ్ కోసం రూ. 20 నుండి రూ.30 వరకు, అదే మొక్కజొన్న బస్తాకైతే ఏకంగా రూ.60వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. లారీ యజమానులతో అధికారులు లోపాయికారి ఒప్పందాలు చేసుకుని, ఈ అక్రమ వసూళ్ళకు తెరలేపారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అక్రమ వసూళ్ళకు తలొగ్గని రైతుల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా సమాధానాలు చెప్తూ రోజులకు రోజులు నిరీక్షించేలా చేస్తున్నారు. ఎండ తీవ్రతకు పంట ఎండిపోతుందనే ఆందోళనతో, విధిలేని పరిస్థితుల్లో రైతులు అప్పులు తెచ్చి మరీ అధికారుల చేతులు తడపాల్సి వస్తోంది.

### రైస్ మిల్లుల్లో 'తరుగు' పేరిట మరో కటింగ్ దందా ..

కేంద్రాల్లో అదనపు డబ్బులు చెల్లించి ఎలాగోలా లారీలు ఎక్కించి రైస్ మిల్లులకు పంపితే, అక్కడ మిల్లుల యజమానులు మరో దందాకు తెరలేపారు. తేమ శాతం రూపంతోనో, నాణ్యత లేదనే సాకుతోనో ఒక్కో బస్తాపై తరువు (తరుగు) పేరుతో ఏకంగా 3 నుండి 4 కిలోల వరకు కటింగ్ చేస్తున్నారు. క్వింటాళ్ళ కొద్దీ ధాన్యం ఇలా కటింగ్‌రూపంలో పోతుండటంతో రైతులు వేల రూపాయలు నష్టపోవాల్సి వస్తోంది. రోజుల తరబడి కాంటాల కోసం ఎండలో వేచి చూసి, చివరకు వచ్చే కొద్దిపాటి లాభాన్ని కూడా ఇలా తరుగు రూపంలో మిల్లుల యజమానులకు సమర్పించుకోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అధికారుల జేబులు నింపడానికేనా మా కష్టం...?

రెక్కలు ముక్కలు చేసుకుని, ఆరుగాలం శ్ర మించి పండించిన పంట ద్వారా వచ్చే నాలుగుపైసలు కూ డా ఇలా బస్తాల వసూళ్ళకు, మిల్లుల కటింగ్‌లకే ధారపోయాల్సి వస్తే, తాము కుటుంబాలను ఎలా పోషించుకోవాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. అధికారుల అండదండలు ఉండబట్టే మిల్లుల వారు ఇంతలా తెగబడుతున్నారని, వసూలైన సొమ్ము కింది స్థాయి నుండి పై స్థాయి వరకు మామూళ్ళుగా వెళ్తుండటం వల్లే ఎవరూ పట్టించుకోవడం లేదని రైతాంగం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

### ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందిచాలి

రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వ యంత్రాంగమే ఇలా లారీ యజమానులతో, మిల్లుల నిర్వాహకులతో చేతులు కలిపి తమ పొట్ట గొడుతుంటే పాలకులు ఏం చేస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం , జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, నిర్మల్ జిల్లా లోని కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న బస్తాల దందాను, రైస్ మిల్లుల్లో సాగుతున్న అక్రమ వసూళ్ళు, తరుగు కోతలు లేకుండా పారదర్శకంగా కొనుగోళ్ళు జరిపి అన్నదాతలను ఆదుకోవాలని రైతాంగం కోరుతోంది.

# భానుడు భగభగలు..




# రాయపూర్ కాండ్లీలో అస్తవ్యస్తంగా మురికినీరు

### డ్రైనేజీ నిర్మించాలని గ్రామస్తుల ఆవేదన

**ప్రజాపక్షం /లోకేశ్వరం:** లోకేశ్వరం మ ండలం లోని రాయపూర్ కాండ్లీ గ్రామంలో మురికినీటి పారుదల వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలోని ఒక వీధిలో మురికి నీరు పూ ర్తిగా నిలిచిపోయి చిన్న కుంటలా తయారైంది. సరైన భద్రత లేకపోవడం, నీరు నిల్వ ఉండటంతో దోమలు వి పరీతంగా ప్రబలుతున్నాయని, దీని వల్ల గ్రామంలో అ ంటురోగాలు వచ్చే ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తుడు కాంతారావుతో పాటు గల్లీ ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంతారావు, స్థానిక ప్రజలు మాట్లాడుతూ, ఇక్కడ డ్రైనేజీ వ్యవస్థను నిర్మిస్తే మురికినీటి సమస్య తీరుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం డ్రైన్ సౌకర్యం లేకపోవడంతో ఇళ్ళనుంచి వచ్చే నీరంతా రోడ్డుపైనే నిలిచి మురికి కాలువలా మారుతోందని, కాలనీవాసులు నడవడానికి కూడా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు, సర్పంచ్ ప్రత్యేక చొరవ తీసుకొని, ఇక్కడ వెంటనే డ్రైనేజీ నిర్మించి మురికినీటి సమస్య నుంచి తమను కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.



# వేగవంతంగా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ




ధాన్యం కొనుగోలు ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి ఉత్తం కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం పలువురు మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ధాన్యం కొనుగోళ్ళపై సమీక్ష నిర్వహించారు.

## ఘనంగా మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం /మెట్‌పల్లి :**టిపిసిసిరాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలను మెట్‌పల్లి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. టిపిసి డెలిగేట్ సుజిత్ రావు ఆదేశాల మేరకు మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు .ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, రాష్ట్ర ఫిషెర్మెన్ ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ,పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు ఖుతుబుద్దీన్ పాషా, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ కార్యదర్శి అమ్ముల పవన్, ఇబ్రహీంపట్నం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లూరి సాగర్, మొగిలి రాజేందర్,బైండ్ల శ్రీకాంత్,ముద్దం ప్రశాంత్,కోరే రాజ్‌కుమార్,షాజెబ్, ఫయుజ్ ఫర్హాన్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

**జగిత్యాలటౌన్‌లో:**జగిత్యాల జిల్లా కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజంగి నందయ్య ఆధ్వర్యంలో పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం డిసిసి అధ్యక్షుడు నందయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ వాణి మాట్లాడుతూ మహేష్ కుమార్ ఒక సామాన్య కార్యకర్తగా జీవితాన్ని ప్రారంభించిఎన్ఎస్‌యుఐ నుండి పిసిసి అధ్యక్షుడిగా తన రాజకీయ ప్రయాణంలో ఒక నిబద్ధత కలిగినటువంటి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు అండగా ఉంటూ ప్రజల గుండెల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల మనసులో మంచి స్థానాన్ని పొందగలిగారన్నారు.కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ గడ్డం. నారాయణ రెడ్డి,మాజీ చైర్మన్ గిరి నాగ బూషణం,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొత్తమోహన్, పిసిసి సెక్రెటరీ బండశంకర్,జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షులు దుమాల రాజ్ కుమార్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బీరం. రాజేష్ , నాయకులు ఆదువాల లక్ష్మన్, రవీందర్ రావు, పులి నరసయ్య,మహంకాళి రాజన్న,చాంద్ పాశ, కౌన్సిలర్ లు పాల్గొన్నారు.

## కొండగట్టు అంజన్నను దర్శించుకున్న కరీంనగర్ మేయర్



**ప్రజాపక్షం/మల్యాల:** జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు ఆంజనేయ స్వామిని కరీంనగర్ మేయర్ కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు.ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు .అనంతరం ఆలయ అర్చకులు మేయర్ దంపతులకు వేదోక్త ఆశీర్వచనాలు అందించి శేష వస్త్రంతో సత్కరించి లడ్డు ప్రసాదం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు రఘు, ముఖ్య అర్చకులు రాము, చిన్న రాము, అభిలాష్‌తో పాటు ఏఎస్ఐ చిలుకా శ్రీనివాస్, టెంపుల్ ఇన్స్పెక్టర్ తూము శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

# దళిత రత్న అవార్డు గ్రహీతలకు సన్మానం

**ప్రజాపక్షం/కోరుట్ల :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రదానం చేసిన "దళిత రత్న" అవార్డు కోరుట్ల పట్టణ ప్రజలు, మేధావులు మరియు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.కోరుట్ల పట్టణానికి చెందిన బైరి విజయ్ కుమార్ బార్ అసోసియేషన్ మాజీ ప్రెసిడెంట్,వనతడుపుల అంజయ్య కల్లూరు గ్రామ మాజీ సర్పంచ్ దళిత సమాజ హక్కుల పరిరక్షణలో సామాజిక చైతన్య నిర్మాణంలో మరియు న్యాయ పరిరక్షణలో వారు చేస్తున్న సేవలను గుర్తించారు.ఈ సందర్భంగా కోరుట్ల సి. ప్రభాకర్ గ్రంథాలయ ఆవరణలో సిపిఐ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం అడ్వకేట్ అధ్యక్షతన అభినందన సభ ఘనంగా నిర్వహించారు. సమాజంలో దళితుల అభ్యున్నతి, సామాజిక న్యాయం, ప్రజాసేవ పట్ల బైరి విజయ్ కుమార్,వనతడుపుల అంజయ్య చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు రావడం ఎంతో గర్వకారణమని జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ ఓటారికారి శ్రీనివాస్ సభలో పేర్కొన్నారు. సమాజ సేవలో వారు మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. దళిత సమాజ హక్కుల పరిరక్షణలో సామాజిక చైతన్య నిర్మాణంలో మరియు న్యాయ పరిరక్షణలో వారు చేస్తున్న సేవలు యువతకు ఆదర్శమని సభలో మరిపెల్లి గంగాధర్ అడ్వకేట్ కొనియాడారు.ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలు అయిన బైరి విజయకుమార్, వనతడుపుల అంజయ్యను శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో న్యాయవాదులు చెన్న విశ్వనాథం, ఓటారికారి శ్రీనివాస్,ప్రేమ్ సాగర్, బద్ది నర్సయ్య, అలాల సత్యనారాయణ,ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ భాస్కర్,బీసీ ఎస్సీ ఎస్టీ విద్యావంతుల వేదిక కన్వీనర్ మరిపెల్లి గంగాధర్,తుల గంగవ్వ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షులు తుల రాజేందర్,కార్మిక నాయకులు సుతారి రాములు,పట్టణ ప్రముఖులు మరియు గ్రంథాలయ పాఠకులు,తదితరులు పాల్గొన్నారు.

# ప్రెస్ క్లబ్ కార్యవర్గం ప్రమాణస్వీకార మహోత్సవం

**ప్రజాపక్షం/ వేములవాడ టౌన్:** తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం వేములవాడ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. పట్టణంలోని ఓ కళ్యాణమండపంలో జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నుకోబడిన కార్యవర్గం, సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కొలిపాక నరసయ్య, ప్రధాన కార్యదర్శి సయ్యద్ అలీలను వర్కింగ్ ప్రెసిడెంట్ పాశం భాస్కర్ రెడ్డి తదితరులను సంఘ సభ్యులు గజమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం అధ్యక్షుడు కొలిపాక నరసయ్య మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న సంఘ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సంఘ బలోపేతం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిబద్ధతతో పని చేస్తానని పేర్కొన్నారు. సంఘ అభివృద్ధికి ప్రతి సభ్యుడు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సయ్యద్ లాయక్ పాషా అధ్యక్షులు కొలిపాక నరసయ్య ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పాశం భాస్కర్ రెడ్డి, గౌరవ సభ్యులుగా కొత్వాల్ శ్రీనివాస్, జితేందర్ రావు, కట్టెకోల రాంప్రసాద్, నేరెళ్ల కరుణాకర్, ఉపాధ్యక్షులుగా దేవరాజ్, అబ్దుల్ జబ్బార్, విష్ణు, క్యాషియర్‌గా పంపరి నాగరాజు, సంయుక్త కార్యదర్శిగా ఫహద్ పాషా, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా జింక శ్రీధర్, చౌటిపల్లి వెంకటేష్, ప్రచార కార్యదర్శులుగా డెబ్బీట్ ప్రవీణ్, శ్రీ రామోజీ వేణు, కార్యవర్గ సభ్యులుగా షబ్బీర్, గంగాధర్, బూర్ల ప్రదీప్, సంటి రాజేందర్, పంథుగ స్వామి, ఆసిమ్, లక్ష్మీ నారాయణ, నవీన్, పి. వేణు, రాము లను నియమించారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. తమకు బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా అధ్యక్షుడు సయ్యద్ లాయక్ పాషా, నూతన అధ్యక్షుడు నర్సయ్యలకు సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తూ జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా పని చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జర్నలిస్టులు, సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# కుల ఈర్ష్యను తరిమి కొడితేనే ఏదైనా సాధ్యం



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండల కేంద్రంలో సామాజిక సేవా కార్యకర్త శాతల్ల లక్ష్మణ్ ఆధ్వర్యంలో "ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న డాక్టర్" బి.ఆర్. అంబేద్కర్ నామస్మరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మాల మహానాడు గొల్లపెల్లి మండల అధ్యక్షుడు పొనగంటి రాజరత్నం పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు.ఈ దేశం అభివృద్ధి చెందకపోవడానికి ప్రధానమైన ముఖ్యకారణం ఇదే నిచ్చెనమెట్ల కుల వ్యవస్థలో కింద కులపోడు ఎంత గొప్ప పనిచేసిన ఎంత గొప్ప పనిచేసిన అది కేవలం దేశకోసం దేశంలోని అణచివేయబడిన ప్రజలకోసం చేసిన ఆ ప్రజలకే నచ్చదు వాడికి ఎంత జ్ఞానం ఉన్న వాడికంటే పై కులం వాళ్ళు ఆదరించరు అభినందించరు అని అన్నారు.అందుకే అంబేద్కర్ 100 ఏళ్ల ముందే చెప్పారు ఈ దేశం నుండి కులాన్ని మనుషుల్లో ఉన్న ఈర్ష్యను తరిమి కొడితేనే ఏదైనా సాధ్యమని కొనియాడారు.భారత రాజ్యాంగాన్ని రూపొందించి ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిన గొప్ప దూర దృష్టి నాయకుడు అంబేద్కర్ అని కొనియాడారు .బడుగు బలహీన వర్గాలు విద్య ద్వారా ముందుకు రావాలని ఆయన ప్రోత్సాహించారని అన్నారు.ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న అంబేద్కర్ నామస్మరణ కార్యక్రమం ద్వారా ప్రజల్లో చైతన్యం నింపుతున్న నిర్వాహకులను వారు అభినందించారు.ఈ కార్యక్రమంలో ఎనగందుల రమేష్,కొండ్రా రాజయ్య,అంబేద్కర్ వాదులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# విఓఎల ఒంటికాలిపై నిరసన

**ప్రజాపక్షం/కౌటాల :**తెలంగాణ ఐకెపి, విఓఎల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో కౌటాల మండల కేంద్రంలో విఓఎలు కండ్లకు నల్ల బ్యాడ్జీలు కట్టుకుని ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. విఓఎల నిరవధిక సమ్మె ఆదివారం ఆరవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విఓఎలకు 20 వేల రూపాయల కనీస వేతనం ఇవ్వాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే అర్హులైన వారికి సిసిలుగా పదోన్నతులు కల్పించాలని, 20 లక్షల రూపాయల బీమా సౌకర్యం, ట్యాబ్, నెట్ సదుపాయం కల్పించడంతో పాటు 58 జీవోను సవరించాలని కోరారు. ప్రభుత్వం తమ డిమాండ్లు నెరవేర్చే వరకు సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జెఏసి మండల అధ్యక్షుడు ఏల్పులే దత్తు, ఉపాధ్యక్షులు రవి, పద్మ, కార్యదర్శులు మహేశ్వరి, ప్రతిభ, కోశాధికారి ఇందు జడే, సహాయ కార్యదర్శులు దేవాజీ, ముక్తేష్, ప్రచార కార్యదర్శులు జడే భీంరావు, శంకర్ పాల్గొన్నారు.

# వివాహ కుటుంబానికి కౌన్సిలర్ కల్లూరి రేణుక–రాజు చేయూత



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని సుందరయ్యనగర్, సిక్ వాడకు చెందిన టాక్ అమ్మన్ కౌర్–జగ్గు సింగ్ ల కూతురు జమున వివాహం పురస్కరించుకొని స్థానిక 36వ వార్డు 36 వ వార్డు కౌన్సిలర్ కల్లూరి రేణుక రాజు 50 కిలోల బియ్యం అందించి నూతన వధువును ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వధువు బంధువులు హర్షం వ్యక్తం చేస్తూ కౌన్సిలర్ కల్లూరి రేణుక రాజు కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గడ్డం వెంకటేష్, గోక లక్ష్మీ రాజం, ఎర్రం రాజు, కుల్ల శ్రీనివాస్,కోడూరి మల్లేశం,కళ్లెపెల్లి రమేష్,నంగునూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కొండగట్టు అంజన్న ఆలయంలో భక్తుల తాకిడి

**ప్రజా పక్షం/మల్యాల:** జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు ఆంజనేయ స్వామి వారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. సెలవు దినం కావడంతో తెలంగాణ రాష్ట్రంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.ఉదయం నుంచే ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి.భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టారు.తాగునీరు, క్యూలైన్లు, ప్రసాద పంపిణీ, పారిశుద్ధ్య నిర్వహణ వంటి అంశాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. రద్దీ దృష్ట్యా పోలీసు సిబ్బంది భద్రతా చర్యలను కట్టుదిట్టం చేసి ట్రాఫిక్‌ను నియంత్రించారు.

## జ్ఞాపకాల తోటలో స్నేహ గీతం



**ప్రజాపక్షం/రాయికల్ :** రాయికల్ పట్టణం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలుర లో 2005–06 పదవతరగతి బ్యాచ్ విద్యార్థులు రెండు దశాబ్దాల కాలం తర్వాత ఆదివారం రాయికల్ పట్టణంలోని శివాజీ రెడ్డి గార్డెన్స్ లో కలుసుకున్నారు తమ పాఠశాల జ్ఞాపకాలు ను పంచుకున్నారు. ఆనాడు తమకు వివిధ సబ్జెక్టులను బోధించిన ఉపాధ్యాయులు టి. అనంత గిరిధర్,గాజెంగి వెంకటయ్య, పొన్నం రమేష్ కామని లక్ష్మ య్య, చెరుకు మహేశ్వర శర్మ,కన్నవేని మల్లారెడ్డి,లక్కాడి రాజారెడ్డి రంగోజీ శ్రీనివాస్ జగదీశ్వర్, ఉమా రాణి లను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా 2005–06 బ్యాచ్ విద్యార్థులు చేసిన సామాజిక సేవా కార్యక్రమాలు తెలిపారు.ఇరవైసంవత్సరాల తర్వాత మళ్లీ కలుసుకునే అవకాశం వచ్చిందని ఆ నందించారు.ఉపాధ్యాయులు మాట్లాడుతూ సమాజంలో గౌరవప్రదమైన జీవితం గడిపే స్థాయికి విద్యార్థులు ఎదగడం గర్వకారణమని అన్నారు.ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బొల్లె రమేష్, అబ్దుల్ వాజిద్ , అందె శంకర్,ఆకు రాజేందర్, వంగల ప్రవీణ్ జె. బాపురావు,మ్యకల తిరుపతి ,సాదిక్ ,కళ్యాణ్,రామెల్లి సురేష్,ముజాహిద్ ముజ్జు ,చెలిమెల మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

## గౌడ సంఘం నూతన అధ్యక్షుడిగా కాసారపు ప్రవీణ్ గౌడ్

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని రాఘవపట్నం గ్రామ గౌడ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ ఎన్నికల్లో గౌడ సంఘం నూతన అధ్యక్షుడిగా కాసారపు ప్రవీణ్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా కాసారపు తిరుపతి గౌడ్‌ను ఎన్నుకున్నారు.కార్యవర్గ సభ్యులుగా కాసారపు శంకరయ్య గౌడ్, బుర్ర నరేష్ గౌడ్, పొన్నం రాజన్న గౌడ్, బుర్ర వెంకటేష్ గౌడ్,బుర్ర జనార్ధన్ గౌడ్,బుర్ర దేవేందర్ గౌడ్ లు ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి గ్రామ సర్పంచ్ కాసారపు భవాని అరవింద్ గౌడ్,సంఘ సభ్యులు పూలమాలలు వేసి అభినందించారు.గౌడ సంఘం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాసారపు భవాని అరవింద్ గౌడ్, మాజీ సర్పంచ్ బుర్ర తిరుపతి గౌడ్,మాజీ ఎంపీటీసీ బుర్ర రాజేందర్ గౌడ్, మెరుగు రవి, గొల్లపల్లి సత్యం గౌడ్, బుర్ర ఆంజనేయులు గౌడ్ లతో పాటు గౌడ కుల పెద్దలు,యువకులు గ్రామస్థులుపాల్గొన్నారు..

## మైత్రి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం డబ్బా గ్రామ పంచాయతీ ఆవరణలో ఆదివారం మెట్పల్లి కి చెందిన మైత్రి హాస్పిటల్ ఆధ్వర్యంలో డాక్టర్ జెవిన్ వెంకట్ నేతృత్వంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 300 మందికి ఉచిత బ్లడ్ గ్రూప్,షుగర్ పరీక్షలు, ఇసిజిపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ రాపల్లి మహేష్, మా జీ సర్పంచులు పుప్పాల నర్సయ్య, లింగంపల్లి గంగాధర్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ భూక్య రాజేందర్, మాజీ ఎంపిటిసిలు ముత్తన్న, మాజీ ఎంపిటిసి జీవన్,వైద్యులు ఆదిత్య, తరుణ్,తేజ పల్లవి, హాస్పిటల్ మేనేజ్మెంట్ సభ్యులు గంధాల శివ ప్రసాద్, బర్ల రవి, భూక్య రాజేందర్, ఎనుగందుల రవి, యాసం రాకేష్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

# అసత్య బిఆర్ఎస్ నాయకుల్లారా ఖబర్దార్

### కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మోబిన్ యూత్ కాంగ్రెస్ నాయకుల ధ్వజం



ప్రజాపక్షం/సుల్తానాబాద్:ఊసరవెల్లిలా పూటకో పార్టీ మార్చి జీవనోపాధి కొనసాగించే మీరు మా నాయకుడు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్ ను విమర్శించే స్థాయి మీది కాదని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోబిన్, యూత్ కాంగ్రెస్ నాయకులు ఆరేపల్లి కిరణ్, దాసరి విజయ్, అంతటి అభినవ్ లు ధ్వజమెత్తారు. గతములో 2 పర్యాయాలు సుల్తానాబాద్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచిగా పనిచేసి సు పట్టణాన్ని అభివృద్ధి పరిచి, పట్టణానికి ఎండ కాలంలో సైతం నీరు అందించిన ఘనత మా నాయకునిదని అన్నారు.పారపల్లి గుణపతి చేసిన ఆరోపణలు సాక్ష్యాలతో నిరూపించాలని అన్నారు. నీ పైన పోలీస్ స్టేషన్లో క్రిమినల్ కేసులు ,నేర చరిత్ర ఎవరి మీద ఉన్నాయని ప్రజలందరికీ తెలుసునని అన్నారు. పట్టణంలోని మాల కుంటను ఆక్రమించుకొని గంగపుత్ర, ముదిరాజ్ లను చాపలు పట్టుకోకుండా నీవు ఒక్కడివే స్వంతముగా చేసుకొని మాల కుంటను ఆక్రమించుకొని ప్లాట్లు పెట్టి అమ్ముకున్న చరిత్ర నీది కాదా అని ప్రశ్నించారు.హమాలీ కూలీలపై డబ్బులు తిన్నావని ఏ ఒక్క హామాలీతో నైనా నిరూపించాలని డిమాండ్ చేశారు. బి ఆర్ ఎస్ పట్టణ అధ్యక్షుడిగా ఉండి మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్ టికెట్లు అమ్ముకున్న నీవు మా నాయకుణ్ణి విమర్శిస్తావా. పేకాట అనుమాల బాబురావు నీవు ఊళ్ళో అందరి వద్ద డబ్బులు అప్పులు చేసి బతికే బతుకు నీది కాదా, ఇంటి నిర్మాణాలు చేసుకుంటే లంచం ఇవ్వకుంటే తట్ట, పార గుంజుక పోయి ఇంటి పనులు ఆపించి, ఇంటి గోడలు కూల్చివేసిన చరిత్ర నీది అన్నారు. ఒక్క సిగరెట్ ఉద్దెర ఇయ్యలేదని టైలాలను తీయించి చరిత్ర నీది అన్నారు. గాంధీనగర్ లో సర్వే నంబర్ లను రిజిస్ట్రేషన్ చేయిస్తానని డబ్బులు వసూళ్లు చేసి, నీ ప్రభుత్వం అధికారంలో ఉండి చేయించక పోతే డబ్బులు ఇచ్చిన వారందరు నీ ఇంటికి వస్తే వాటర్ ట్యాంక్ ఎక్కి బ్లాక్ మెయిల్ చేసిన చరిత్ర నీది అని అన్నారు. అప్పులు చేసి పేకాట ఆడుతూ అందరికి అప్పులు ముంచే నీవు సిగ్గు లేకుండా మాట్లాడే స్థాయి నీది కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటిల్లి పాదీ అందరి కాళ్ళు మొక్కి కౌన్సిలర్ గా గెలిచినావు తప్ప ఏమి లేదన్నారు. ఒక ఆడ బిడ్డ వద్ద 5 లక్షలు అప్పు తీసుకొని ఆడ బిడ్డకు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టి ఉల్టా ఆడ బిడ్డ పై కేసు పెట్టిన నీవు నీతి మంతుని లా మాట్లాడటం సిగ్గు ఉండాలన్నారు. ఈర్షతో రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక అసత్య ఆరోపణలు చేసి మా నాయకుణ్ణి విమర్శిస్తే తిరిగి తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు ఆరేపల్లి కిరణ్ ,దాసరి విజయ్, కామ సంజీవ్,అంతటి అభినవ్ గౌడ్,సామనపల్లి శివ, బొమ్మ సాయి, శ్రీమంతుల శివ,భగవాన్,అభిరామ్,తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్మన్

ప్రజా పక్షం/ కోనరావుపేట / వేములవాడ: వేములవాడ నియోజకవర్గం కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ మహోత్సవం కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మానుక సత్యం. సుద్దాల సర్పంచ్ నాగరాజు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు వార్డు మెంబర్లు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి పరామర్శ

ప్రజాపక్షం/జన్నారం:జన్నారం మండలం రాంపూర్ గ్రామానికి చెందిన దాసరి చంద్రమౌళి ఇటీవల మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను ఖానాపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇన్చార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ పరామర్శించారు. ఆదివారం రాంపూర్ గ్రామంలోని చంద్రమౌళి నివాసానికి వెళ్లిన ఆయన మృతుడి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్రమౌళి కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, వారి కుటుంబానికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. జన్నారం మండల ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ప్రథమ పోచమ్మ తల్లికి బోనాలు

ప్రజాపక్షం/రాయికల్ : రాయికల్ పట్టణంలోని కేశవ నగర్ లో విశ్వబ్రాహ్మణ మనుమయ భక్త బృందం ఆధ్వర్యంలో పోచమ్మ తల్లికి ఆదివారం బోనాలు ఘనంగా సమర్పించారు. రాయికల్లో ప్రథమ పోచమ్మ తల్లికి గత సంవత్సరం పున విగ్రహ ప్రతిష్ఠ ఏర్పాటు చేసిన సందర్భంగా 11 నెలలలో మారుబోనం తీయడానికి విశ్వబ్రాహ్మణ కులస్తులు అందరూ కలిసి ఐకమత్యంతో ఆదివారం అమ్మవారికి బోనాలు సమర్పించుకున్నారు. గట్టుపల్లి నరహరి, గట్టుపల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# కిక్ బాక్సింగ్‌తో శరీర దృఢత్వం

### మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ రాజు యాదవ్, వైస్ చైర్మన్ బుచ్చేష్ యాదవ్



ప్రజాపక్షం/నర్సాపూర్:కిక్ బాక్సింగ్ తో మానసిక ఉల్లాసం తో పాటు శరీర దృఢత్వం పెరుగుతుందని నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ లక్ష్మి రాజు యాదవ్, వైస్ చైర్మన్ బుచ్చేష్ యాదవ్ అన్నారు. నర్సాపూర్ పట్టణంలోని విజేత హైస్కూల్లో మెదక్ జిల్లా కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలరోజుల పాటు విద్యార్థులకు కిక్ బాక్సింగ్ కర్ర సాము సమ్మర్ క్యాంప్ నిర్వహించారు. అయితే శనివారం ముగింపు కార్యక్రమం సందర్భంగా పిల్లలకు సర్టిఫికెట్లు ప్రధానం చేయగా ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ లక్ష్మి రాజు యాదవ్, వైస్ చైర్మన్ బుచ్చేష్ యాదవ్, పిఎసిఎస్ చైర్మన్ రాజు యాదవులు హాజరై విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి సమాజంలో జరుగుతున్న దుర్ఘటనల దృష్ట్యా ప్రతి అమ్మాయి తనను తాను కాపాడుకోవడానికి ఆత్మరక్షణ విద్యను నేర్చుకోవడం ఎంతో అవసరమని గుర్తు చేశారు. వేసవిలో కిక్ బాక్సింగ్ పై శిక్షణ ఇవ్వడం ఎంతో అభినందనీయమని అందుకు మెదక్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీకాంత్, నిరంజన్ దాస్, అసోసియేషన్ ప్రతినిధులు నాగరాజు, శేఖర్, సమీర్, సిద్ధార్థ, ఆజాం తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం

ప్రజాపక్షం/శ్రీరాంపూర్:శ్రీరాంపూర్ ఏరియా పరిధిలోని సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో 2026–27 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఇందులో భాగంగా సింగరేణి ఉద్యోగుల పిల్లల ప్రత్యేక కోటా సీట్ల భర్తీకి ఆదివారం నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో సింగరేణి ఉద్యోగుల వారసుల కోసం ప్రత్యేకంగా మొత్తం 150 సీట్లు కేటాయించినట్లు తెలిపారు. అందులో సివిల్ ఇంజినీరింగ్ 30, కంప్యూటర్ సైన్స్ 30, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ 30, మెకానికల్ ఇంజినీరింగ్ 30, మైనింగ్ 30 సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సీట్లకు సింగరేణి ఉద్యోగుల పిల్లలు మాత్రమే అర్హులని స్పష్టం చేశారు. పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థులు మే 24 నుంచి జూన్ 8 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. దరఖాస్తుల కోసం scp.scpolytechnic.com వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు. దరఖాస్తు ప్రక్రియకు సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే 8790112515, 9908151618, 9010222161 నంబర్లను సంప్రదించాలని కోరారు.

## ఉప్పరోని గడ్డలో బడిబాట




ప్రజాపక్షం/మద్దూరు/ధూళిమిట్ట : విద్యార్థుల విద్యా పురోగతి, ప్రవర్తనా అభివృద్ధి మరియు విద్యార్థుల పూర్తి శ్రేయస్సుకు శ్రమిస్తూ, విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దుతున్నా రేబర్తి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల కృషి అభినందనీయం అని ఉప్పరోని గడ్డ గ్రామ సర్పంచ్ రామస్వామి పాటుగా గ్రామస్తులు అభినందించారు. ఆదివారం మద్దూరు మండలంలోని ఉప్పరోని గడ్డలో బడిబాట కార్యక్రమంను రేబర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు చంద్రబాను ఆద్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో గ్రామ సర్పంచ్ రామస్వామి యాదవ్‌తో కలిసి ప్రధానోపాధ్యాయులు చంద్రబాను గ్రామంలోని పిల్లలను తమ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. తమ గ్రామంకు రవాణ సౌకర్యం లేదని కల్పిస్తే ప్రభుత్వ పాఠశాలకు పంపిస్తామని తల్లిదండ్రులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు ఆదర్శంగా గ్రామ సర్పంచ్ రామస్వామి యాదవ్ తన పిల్లలను రేబర్తి ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తానని హామీ ఇచ్చారు. ప్రధానోపాధ్యాయులు చంద్రబాను మాట్లాడుతూ, నాన్యమైన విద్యను అందించడంలో ప్రభుత్వ పాఠశాలలు భేష్‌గా పనిచేస్తున్నాయని, గ్రామాల్లోని ప్రతి విద్యార్థిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, మల్లేశం, శ్రీనివాస్ రెడ్డి, రఫత్, రాజిరెడ్డి, నసీరుద్దీన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ప్రజాపక్షం / దిలావర్‌పూర్ : జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల, దిలావర్‌పూర్‌కు చెందిన ఎస్ఎస్‌సి 2006–2007 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం అత్యంత ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి నాటి పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సుమారు 20 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత క్లాస్‌మేట్స్ అందరూ ఒకేచోట కలుసుకోవడంతో పాత జ్ఞాపకాలు మళ్ళీ సజీవంగా గుర్తుకు వచ్చాయి.. విద్యార్థులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ, తమ పాఠశాల రోజుల నాటి తీపి అనుభవాలను పంచుకుంటూ రోజంతా ఎంతో ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులను పూర్వ విద్యార్థులు అత్యంత ఘనంగా సన్మానించి, వారి అమూల్యమైన సేవలను కొనియాడారు. అనంతరం పలువురు విద్యార్థులు మాట్లాడుతూ, ఇలాంటి ఆత్మీయ సమావేశాలు పాత రోజులను గుర్తు చేసుకోవడంతో పాటు మారుతున్న కాలంలోనూ స్నేహ బంధాలను మరింత బలోపేతం చేయడానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈ కలయికలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఒకరినొకరు జ్ఞాపికలు అందజేసుకోవడం , అందరూ కలిసి దిగిన గ్రూప్ ఫోటోలు ఈ వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

# మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం



ప్రజాపక్షం/మద్దూరు/ధూళిమిట్ట : ధూళిమిట్ట మండలం కొండాపూర్ తండాలలో ఇటీవల మరణించిన దరవత్ దోలి, మరియు నవీన్‌ల బాధిత కుటుంబ సభ్యులను బిఆర్ఎస్ పార్టీ నేతలు ఆదివారం పరామర్శించారు. జనగామ ఎంఎల్ఏ పల్లా రాజేశ్వర్ రెడ్డి పంపించిన ఆర్థిక సహాయంను బిఆర్ఎస్ ధూళిమిట్ట మండల పార్టీ అధ్యక్షులు మంద యాదగిరి స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాదవశాత్తు మృతి చెందడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే బాధిత కుటుంబ సభ్యులకు పార్టీ వెన్నంటి ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు దిడిగం రాజేశం, బదావత్ శ్రీనివాస్, జాటోత్ కలారం, ఇస్లావత్ రమేష్, సొసైటీ మాజీ డైరెక్టర్ భూక్య జగన్ తదితరులు పాల్గొన్నారు.

## దేశీదారు పట్టివేత: కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాధిక వెల్లడి

**ప్రజాపక్షం/ తలమడుగు:** మండలంలోని సోనాపూర్ గ్రామ శివారులో అక్రమంగా తరలిస్తున్న మహారాష్ట్ర దేశీదారును తలమడుగు పోలీసులు పట్టుకున్నారు. తాంసీ మండలం గిరిగాం గ్రామానికి చెందిన వర్గురే శివదాస్ తెలంగాణ రాష్ట్రంలో నిషేధించిన దేశీదారును తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తలమడుగు ఎస్ఐ రాధిక తెలిపారు.

## ఘనంగా టిపిసిసి అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్ మండలకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ జన్మదిన వేడుకలను ఆదివారం మండల కాంగ్రెస్ కార్యాలయంలో కార్యకర్తలు, నాయకుల సమక్షంలో ఘనంగా నిర్వహజంచారు. జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావు, డీసీసీ చైర్మెన్ ఏలే మల్లిఖార్జున్ ఆదేశానుసారం కేక్ కట్ చేసి మహేష్‌కుమార్‌గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా పార్టీ బలోపేతానికి ఆయన చేస్తున్న సేవలను కొనియాడుతూ నాయకులు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**నిర్మల్ టౌన్ :** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు నిర్మల్ జిల్లా కేంద్రంలో ఘనంగా జరిగాయి. రాష్ట్ర పిసిసి ప్రధాన కార్యదర్శి ఎంబడి రాజేశ్వర్ గారి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు నగరేశ్వరవాడ శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, కేక్ కట్ చేశారు. అనంతరం 'డవ్' అనాథ ఆశ్రమంలో వస్త్రాల పంపిణీ, ఇందిరమ్మ కాలనీలో భారీ అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంబడి రాజేశ్వర్ మాట్లాడుతూ, మహేష్ కుమార్ గౌడ్ గారు పిసిసి అధ్యక్షుడు అయిన తర్వాత గాంధీభవన్‌లో మంత్రులను అందుబాటులో ఉంచి ప్రజా సమస్యల పరిష్కారానికి సరికొత్త ముందడుగు వేశారని కొనియాడారు. అధికారం ఉన్నప్పటికీ కేవలం ప్రజల, కార్యకర్తల శ్రేయస్సు కోసమే ఆయన రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేసిన గొప్ప నాయకుడని శ్లాఘించారు. గ్రామం నుండి రాష్ట్ర స్థాయి వరకు కార్యకర్తలను నాయకులుగా తీర్చిదిద్దే కర్మాగారం మహేష్ అన్న అని ఆయనను కాంగ్రెస్ పార్టీకి అందించిన స్వర్గీయ బొమ్మ గంగాధర్ గౌడ్ గారి సేవలు చిరస్మరణీయమని గుర్తుచేసుకున్నారు. ఈ వేడుకల్లో డాక్టర్ జయశ్రీ ఎంబడి రాకేష్, స్వదేశీ పరికిపండ్ల సతీష్ వర్మ, ఆత్మారాం, అంబాజీ రాథోడ్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం అధ్యక్షునిగా విజయ్‌కుమార్‌గుప్తా

**ప్రజాపక్షం/పిట్లం:** పిట్లం మండల ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షునిగా మంచి విజయ్ కుమార్‌గుప్తా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం సంఘ సభ్యుల సమక్షంలో నిర్వహించిన ఎన్నికలో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయ్ మాట్లాడుతూ సంఘ బలోపేతానికి తమవంతు కృషిచేస్తానని, సభ్యులందరికి అందుబాటులో ఉండి సేవచేస్తామన్నారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు విజయ్‌ను శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు, కులపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# విద్య జీవితంలో అత్యంత ముఖ్యమైనది

### మాజీ ఎమ్మెల్యే గణేష్ గుప్తా

**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** విద్య అనేది ప్రతి మనిషి జీవితంలో అత్యంత ముఖ్యమైనదని, విద్యనందు ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పురస్కారాలు అందజేయడం వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందని నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా అన్నారు. ఆదివారం నగరంలోని శ్రీ లక్ష్మి కళ్యాణ మండపంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో జిల్లా సర్వసభ్య సమావేశం, విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వైశ్య సమాజానికి సేవా దృక్పథం సహజసిద్ధమన్నారు. డబ్బును ఎవరైనా దోచుకోవచ్చని, కానీ విద్యను మాత్రం ఎవరూ దోచుకోలేరని అందుకే తమ తాతగారు బిగాల గంగారాం పేరుపై ప్రయిమరీ స్కూల్, తండ్రి బిగాల కృష్ణమూర్తి పేరుపై హైస్కూల్ నిర్మించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చామని అన్నారు. ప్రతి ఒక్కరు విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, విద్య ద్వారానే వ్యక్తి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోగలడని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర




ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మి నారాయణ, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, ఆగీర్ వెంకటేశ్, రేణుకుంట గణేష్, ఇరుకుల రామకృష్ణ, చింతల రవికుమార్, మోటూరి మురళి, పోల సుధాకర్, మంకాళి విజయ్, బచ్చురామ్, బచ్చు అంజయ్య,చిదుర ప్రదీప్, నీల భాస్కర్, కందకుర్తి రామకృష్ణ, తాటి వీరేశం, చిదుర మాణిక్యం పాల్గొన్నారు.

# నిర్మల్ పట్టణంలో కోతుల బెడదకు చెక్

### 70 కోతులను పట్టుకున్న మున్సిపల్ సిబ్బంది

**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** నిర్మల్ పట్టణ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న కోతుల బెడద నివారణకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఈ రోజు పట్టణంలోని బుదావార్‌పేట్ 37వ వార్డులో మున్సిపల్ సిబ్బంది ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించి సుమారు 70 కోతులను బంధించారు. పట్టుకున్న ఈ కోతులను కవ్వాల్ అటవీ ప్రాంతంలో సురక్షితంగా విడిచిపెట్టనున్నట్లు నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మెన్ అప్పాల గణేష్ చక్రవర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణ ప్రజలను కోతుల సమస్య నుండి విముక్తి చేయడమే ధ్యేయంగా ఈ ప్రక్రియను నిరంతరం కొనసాగి



స్తామని వెల్లడించారు. కోతుల సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో మున్సిపల్ సిబ్బంది ప్రత్యేక నిఘా ఉంచి వాటిని అడవుల్లోకి తరలిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానీటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, ఫయాజ్ మరియు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## లోవోల్టేజ్‌కు ఉపశమనం

**ప్రజాపక్షం/కోటగిరి :** మండల కేంద్రంలోని మిర్జాపూర్ కాలనీలో వారం రోజుల నుండి లోవోల్టేజీ ద్వారా ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామస్తులకు విద్యుత్ శాఖాధికారి బుచ్చిబాబు స్పందించి ఆదివారం 15 కెవి ట్రాన్స్‌ఫార్మర్ బదులుగా 25 కెవి ట్రాన్స్‌ఫార్మర్ బదులుగా 25 కెవి ట్రాన్స్‌ఫార్మర్ బిగించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. లోవోల్టేజీ పలు రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నగ్రామస్తులకు ఉపశమనం కలిగింది. కార్యక్రమంలో లైన్‌మెన్ వైద్యనాథ్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

## పందుల వీరవిహారం

**ప్రజాపక్షం/కోటగిరి :** మండల కేంద్రంలోని మిర్జాపూర్ కాలనీలో పందుల పెంపకందారులు ఇష్టారాజ్యంగా విడిచిపెట్టడంతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఊరు బయట ఉండాల్సిన పందులు కాలనీలో ఉంటూ ఇబ్బందులు కలుగజేస్తున్నాయి. పందులతో మెదడువాపు వ్యాధులు వస్తాయని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పందుల బెడద నుండి కాపాడాలని కోరుతున్నారు.

## ఘనంగా జరిగిన టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/మోర్తాడ్:** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఆదివారం రోజు కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గం ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ ఆధ్వర్యంలో టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలను కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించి, సంబరాలు జరుపుకున్నారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనేక మంది మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బొబ్బిలి సువర్ణ వేణుగోపాల్‌ని సన్మానించిన ఎగ్జిబిషన్ సొసైటీ

**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** ఆదివారం ఇందూరు నగరంలోని పాలిటెక్నిక్ మైదానంలో ప్రభుత్వ ఎడ్యుకేషనల్ అగ్రికల్చర్ ఎగ్జిబిషన్ కమిటి సభ్యులు 45వ డివిజన్ కార్పొరేటర్ బొబ్బిలి సువర్ణ వేణుగోపాల్‌ని సన్మానించారు.

## ఘనంగా మహేష్‌కుమార్ జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నిక కావటం జిల్లాకు దక్కిన గౌరవమని, జిల్లాకు ఎంతో లబ్ధి చేకూరుతుందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నగేష్‌రెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ అన్నారు. మహేష్‌కుమార్‌గౌడ్ జన్మదిన సందర్భంగా జిల్లా కాంగ్సెర్ కమిటీ అధ్యక్షులు నగేష్‌రెడ్డి నాయకులు ఆధ్వర్యంల కేక్ కట్ చేసి జన్మడిన వేడుకలు ఘనంగా నిర్వహించామన్నారు.మేయర్ ఉమారాణి, తాహెర్‌బిన్ హందాన్, శేఖర్‌గౌడ్, ఆకుల లలిత, రాంభూపాల్, రామకృష్ణ, భక్తవత్సలం, రత్నాకర్, ఘన్‌రాజ్, కౌడప్ శరత్‌కుమార్, గోపి, రత్నాకర్ గౌడ్, ప్రవీన్‌గౌడ్, రవి, గోపాల్, నగేష్, సుజాత, రాజేంద్రప్రసాద్, రోహిత్, విపుల్‌గౌడ్, రాజానరేందర్‌గౌడ్, యాదగిరిగౌడ్, యాదగిరి, ఖుద్దూస్ పాల్గొన్నారు.

**భీమ్‌గల్ రూరల్ :** నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ ఆదేవాల మేరకు కాంగ్సెర్ పార్టీ భీమ్‌గల్ మండల అధ్యక్షులు మల్లె లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపి ఒకరికొకరు తినిపించుకున్నామన్నారు. జనార్ధన్, చరణ్‌గౌడ్, మనూష అశోక్, సమీర్, మోహన్, స్వామి, మహేష్, బలరాం పాల్గొన్నారు.

## యాపాలగూడ గ్రామంలో వైద్య శిబిరం



**ప్రజాపక్షం/ ఆదిలాబాద్ రూరల్:** మండలంలోని యాపాలగూడ గ్రామంలో ఆదివారం జన్ భాగీదారీ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆ శిబిరంలో ఎన్‌సీడీ స్క్రీనింగ్‌లో 44 మందికి, సికిల్ సెల్ పరీక్షలు 42 మందికి, గర్భిణీలకు 7 రక్త పరీక్షలు, 12 మందికి హెచ్‌బీ పరీక్షల నిర్వహించినట్లు డాక్టర్ దాసరి కృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు. ముగ్గురికి టీబీ పరీక్షలు చేసి గళతు నమూనాలను ల్యాబ్‌కు పంపించామని, 35 మందికి ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశామన్నారు. ఈ క్యాంపు ద్వారా మొత్తం 56 మందికి వైద్య సేవలు అందించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సహాయకులు గుండం శ్రీదేవి, పవార్ ప్రేమసింగ్, జన్మన్ సిబ్బంది సింధు, అరుణ, పల్లవి, గ్రామ సర్పంచ్ కొడప నిరోషా, ఆశా కార్యకర్తలు రమాదేవి, పుష్పలత, గంగుబాయి, రూపబాయి, అంగన్వాడీ టీచర్ మాధవి, పంచాయతీ సెక్రెటరీ రాఖీ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రెడ్డి సంక్షేమ సంఘ నూతన కార్యవర్గాన్ని అభినందించిన కంది శ్రీనివాస రెడ్డి




**ప్రజాపక్షం/ మావల:** ఆదిలాబాద్ జిల్లా రెడ్డి సంక్షేమ సంఘ నూతన కార్యవర్గాన్ని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అభినందించారు. ఆదివారం ఆయన పట్టణంలోని న్యూ హౌజింగ్ బోర్డు కాలనీలో గల సంఘ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఏకగ్రీవంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షులు ఎల్టి ఓంప్రకాష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి అల్లూరి భూపతి రెడ్డి, కోశాధికారి సర్సన్ విట్టల్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్లు రమేష్ రెడ్డి, ప్రమోద్ రెడ్డి, కో ప్రెసిడెంట్లు గోవర్ధన్ రెడ్డి, మణిలతా రెడ్డి, ఇతర కార్యవర్గ సభ్యులను శాలువాలతో సత్కరించారు. అనంతరం కంది శ్రీనివాస రెడ్డి మాట్లాడూతూ నూతన కార్యవర్గం సంఘ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు స్వామి రెడ్డి, భూమారెడ్డి, శేఖర్ రెడ్డి, పోతా రెడ్డి, సుశాంత్ రెడ్డి పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/ మావల:** వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, సీఎస్‌తో కలిసి కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. తాలు, తరుగు పేరిట రైతుల ధాన్యంలో కోతలు విధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇదే సమావేశంలో మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ .. ఈ నెల 25 నుంచి 30 వరకు మహిళా వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులతో సమీక్షిస్తూ ధాన్యం కొనుగోళ్లు, మహిళా వారోత్సవాలను జిల్లాలో వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్లు చిత్రు, రాజేశ్వర్, అధికారులు పాల్గొన్నారు.

